గ్రామ స్వరాజ్యానికి తూట్లు!

- కూటమి ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం
- ఖాళీగా దర్శనమిస్తున్న కార్యాలయాలు
- తెరుచుకోని వెబ్‌సైట్లు
- ప్రజలకు తప్పని ఇక్కట్లు



వెల్ఫేర్ అసిస్టెంట్ ఫీల్డ్‌కు వెళ్లిపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న బూర్జపాడు సచివాలయం

ఇచ్ఛాపురం రూరల్: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ సిద్ధింపజేసింది. వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి సొంత గ్రామాల్లో వివిధ రకాల ప్రభుత్వ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సచివాలయాల్లో నేడు ఈ పరిస్థితి కనిపించడం లేదు. గ్రామ స్వరాజ్యానికి పాలకులు తూట్లు పొడుస్తున్నారు. చంద్రబాబు పాలనకు ఐదు నెలలు కావస్తున్నా.. ఇప్పటికే కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల వెబ్ సైట్లు తెరుచుకోకపోవడమే ఇందుకు నిదర్శనం. అలాగే వివిధ సేవలకు సంబంధించి సర్టిఫికెట్ల జారీలో కీలకంగా ఉన్న కంప్యూటర్ ప్రింటర్లు సైతం చాలా సచివాలయాల్లో పనిచేయడం లేదు. దీంతో అనేక మంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఖాళీగా దర్శనమిస్తున్న సచివాలయాలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సచివాలయాలను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేసింది. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికి వెళ్లి వలంటీర్లు పింఛన్లు అందజేసేవారు. ప్రస్తుతం ఆ పనిని సచివాలయ ఉద్యోగులచే చేయిస్తోంది కూటమి ప్రభుత్వం. అంతే కాకుండా సచివాలయాల్లో సేవలను పూర్తిగా కుదించి ఉద్యోగులకు అదనపు బాధ్యతలు కట్టబెట్టింది. ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లు అతికించడం, పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయించడం తదితర పనులతో మరోసారి సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగులను బదిలీలు చేయడంతో ఇచ్ఛాపురం మండలంలోని ఉన్న 16 గ్రామ సచివాలయాల్లోని ఉద్యోగులు తమ సొంత ప్రాంతాలకు వెళ్లిపోవడంతో ఇప్పుడు సచివాలయాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. బూర్జపాడు, ఈదుపురం-1, తేలుకుంచి, అరకబద్ర వంటి సచివాలయాల్లో ఒక్కొక్కరే దర్శనమిస్తున్నారు. దీంతో విద్యార్థులకు అవసరమైన ముఖ్యమైన కుల, ఆదాయ ధ్రు పత్రాలకు మునుపటిలా తహసీల్దార్ కార్యాలయాలకు, రైతులు మండల వ్యవసాయ కార్యాలయాలకు, రైతులు భూ సమస్యలకు మండల సర్వేయర్ కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. అదే విధంగా 16 గ్రామ సచివాలయాలకు 16 మంది పంచాయతీ కార్యదర్శులు ఉండాల్సిన చోట కేవలం ఏడు మంది కార్యదర్శులు మాత్రమే పనిచేస్తున్నారు. అలాగే తొమ్మిది మంది డిజిటల్, పది మంది ఇంజినీరింగ్, 11 మంది వెల్ఫేర్ అసిస్టెంట్లు, నలుగురు విలేజ్ సర్వేయర్లు, ఆరు మంది మహిళా పోలీసులు ఉండగా, అందులో ఇద్దరు ప్రసూతీ సెలవుల్లో ఉన్నారు. దీంతో సచివాలయాల్లో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి.



ఈదుపురం సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ఒకేఒక్క ఉద్యోగి

మండల కార్యాలయాలే దిక్కు..



గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటైన సచివాలయ వ్యవస్థ ద్వారా సామాన్యుడు నుంచి విద్యార్థి వరకు తమకు అవసరమైన పత్రాలను గ్రామ సచివాలయాలు ద్వారా దక్కించుకునేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సంబంధిత ఉద్యోగులకు ఇతర బాధ్యతలు, చాలా మంది బదిలీలపై వెళ్లిపోవడంతో ఇప్పుడు సచివాలయాలు ఖాళీగా దర్శనమిస్తున్నాయి. ధ్రువ పత్రాలు కావాలంటే తహసీల్దార్ కార్యాలయాలు చుట్టూ తిరగాల్సి వస్తోంది. మా సచివాలయంలో ఒకే ఒక్క ఉద్యోగి విధులు నిర్వహిస్తున్నారు.

– దున్న గురుమూర్తి, వైస్ ఎంపీపీ, బూర్జపాడు, ఇచ్ఛాపురం

మూడు మద్యం బాటిళ్లకే అనుమతి

- అదనంగా విక్రయించేవారిపై చర్యలు
- 'సాక్షి'తో టెక్కలి ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్



షేక్ మీరా సాహెబ్, ఎక్సైజ్ సీఐ, టెక్కలి

టెక్కలి: ఒక వ్యక్తికి మూడు మద్యం బాటిళ్లనే విక్రయించాలని టెక్కలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ షేక్ మీరా సాహెబ్ స్పష్టం చేశారు. అంతకొంటే విక్రయించేవారిపై చర్యలు ఉంటాయన్నారు. ప్రభుత్వ అమలు చేసిన నూతన మద్యం పాలసీ విధానంలో భాగంగా టెక్కలి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల్లో కేటాయించిన 11 దుకాణాల్లో మద్యం విక్రయాలు ప్రారంభమైనట్టు 'సాక్షి'కి శుక్రవారం తెలిపారు.

సాక్షి: టెక్కలి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎన్ని దుకాణాలు ఏర్పాటు చేశారు? విక్రయాలు ఎలా ఉన్నాయి?

సీఐ: టెక్కలి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో టెక్కలిలో ఏడు, నందిగాంలో రెండు, మెళియాపుట్టిలో రెండు దుకాణాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతానికి మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. ఒక్కో దుకాణంలో రోజుకు లక్ష రూపాయలకు పైగా అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ నెల 31 వరకు ప్రొవిజనల్ లైసెన్స్ సమయం ఉంటుంది.

సాక్షి: మద్యం దుకాణాలు తెరిచేందుకు ఎంత సమయం నిర్దేశించారు?

సీఐ: ప్రభుత్వం నిర్దేశించిన సమయం ప్రకారం ఉదయం పది గంటలకు తెరిచి రాత్రి పది గంటలకు మూసివేయాలి.

సాక్షి: ఒక వ్యక్తికి ఎన్ని మద్యం బాటిళ్లు అమ్మకం చేయాలి? లూజ్ కౌంటర్‌కు (పర్మిట్ రూమ్) అవకాశం ఇచ్చారా?

సీఐ: మద్యం పాలసీ విధానంలో భాగంగా ఒకరి ఒకసారి మూడు మద్యం బాటిళ్లను మాత్రమే విక్రయించాలి. అలా కాకుండా అధికంగా విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతానికి ఎటువంటి లూజ్ కౌంటర్‌కు అవకాశం లేదు.

సాక్షి: బెల్టు దుకాణాలపై ఎటువంటి నిఘా వేస్తున్నారు?

సీఐ: ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎక్కడా ఎటువంటి బెల్టు దుకాణాలు ఏర్పాటు చేయకూడదు. వీటిపై ప్రత్యేక నిఘా వేస్తున్నాం. ఎక్కడైనా బెల్టు దుకాణం ఏర్పాటు చేసినట్లయితే 94409 02355, 94412 87145, 83745 04707 నంబర్లకు సమాచారం అందజేయవచ్చు.

ఆర్థిక పురోగతి సాధించాలి



మాట్లాడుతున్న ప్రసాదరావు

కంచిలి: స్వయంశక్తి సంఘాలు బలోపేతమై ఆర్థిక పురోగతిని సాధించాలని స్థానిక ఏపీఎం ఎస్.ప్రసాదరావు అన్నారు. మండల సమాఖ్య కార్యాలయంలో ప్రగతిలో వెనుకబడిన వీవోఏలతో ప్రత్యేక సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ కార్యక్రమాల్లో అవగాహన కల్పించడంతోపాటు పెండింగ్ పనులు పూర్తి చేయాలని సూచించారు.

కొడుకు అదృశ్యంపై ఫిర్యాదు



ప్రవీణ్

కాశీబుగ్గ: తన కొడుకు ఈ నెల 23వ తేదీ నుంచి కనిపించడం లేదని పలాస మండలం ఈదురాపల్లి గ్రామానికి చెందిన ధనలక్ష్మి ఫిర్యాదు చేసినట్టు కాశీబుగ్గ పోలీసులు శుక్రవారం తెలిపారు. మామిడిమెట్టు పంచాయతీ రంగోయి సచివాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న తన కొడుకు ప్రవీణ్ (27) ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని.. పరిసర గ్రామాల్లో వెతికినప్పటికీ ఆచూకీలేదని ఫిర్యాదులో పేర్కొన్నట్టు చెప్పారు.

బదిలీ ఉద్యోగికి సత్కారం



సునీతను సన్మానిస్తున్న దృశ్యం

కంచిలి: మండల కేంద్రం కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐదేళ్లపాటు యూడీసీగా విధులు నిర్వర్తించిన తామాడ సునీతకు సోంపేటకు బదిలీ అయింది. దీంతో పాఠశాల హెచ్ఎం సీతారాంనాయుడు ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో శుక్రవారం సాయంత్రం సునీతను దుశ్శాలువతో సన్మానించారు. ఆమె సేవలు కొనియాడారు. ఉపాధ్యాయులు, మిగతా సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్లతో ఇబ్బందులు!

టెక్కలి రూరల్: విచ్చల విడిగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లతో జనం ఇబ్బంది పడుతున్నారు. ఇసుకను తరలించే సమయంలో కనీసం టార్పలిన్లు కప్పడం లేదు. దీంతో ఇసుక ఎగిరిపడి వెనుక వస్తున్న వారి కళ్లలో పడుతుండడంతో అవస్థలు పడుతున్నారు. వాస్తవంగా ఇసుకను తరలించే సమయంలో విధిగా టార్పలిన్ వేయాలి. కానీ టెక్కలిలో ఆ పరిస్థితి లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుకను తరలిస్తున్న వాహనాలపై దృష్టిపెట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చింతపోలమ్మకు తిలక్ పూజలు



చింతపోలమ్మ తల్లిని దర్శించుకుంటున్న తిలక్ తదితరులు

నందిగాం: లఖిదాసుపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామదేవత చింతపోలమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం వైభవంగా జరిగింది. గ్రామపురోహితులు శాస్త్రోక్తంగా నిర్వహించిన ప్రతిష్ఠ కార్యక్రమంలో విశేష పూజలు చేసిన అనంతరం అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ పాల్గొన్నారు. పురోహితుల ఆశీర్వచనాలు అందజేశారు. ఈయనవెంట ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, నాయకులు చిన్ని జోగారావు, పోలాకి మోహనరావు, బొంగి మోహనరావు, బొంగి హనుమంతురావు, పల్ల అప్పారావు, పొందల లక్ష్మణరావు, మాదిన గోపాలక్రిష్ణ, సర్లాన బైరాగి, బాలక మధు, నడుపూరి పాపారావు, బాలక ప్రభాకర్, ఈగల సిమ్మన్న, కర్రెన్న, జోగారావు ఉన్నారు.

పిల్లలకు నాణ్యమైన భోజనాలు అందజేయాలి

టెక్కలి: వసతి గృహం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందజేయాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి (ఎఫ్ఏసీ) జె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రాత్రి నందిగాం మండలంలోని కేజీబీవీ, ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంతమంది విద్యార్థులు ఉన్నారు, వారికి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. వసతి గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలన్నారు



వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జడ్జి శ్రీనివాసరావు

మురుగునీటి శుద్ధి ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన



స్థల పరిశీలనలో అధికారులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం మున్సిపాలిటీలో మురుగునీటి శుద్ధ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఒకటో వార్డు పురుషోత్తపురంలో పర్యటించి ప్లాంట్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని పరిశీలించారు. పరిశీలనలో ఆర్డీవో కృష్ణమూర్తి, మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, రెవెన్యూ అధికారి శ్రీహరి ఉన్నారు.

ప్రజా ఫిర్యాదుల విభాగానికి 15 వినతులు

కాశీబుగ్గ: కాశీబుగ్గ పోలీసు డివిజన్ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల విభాగానికి 15 వినతులు వచ్చాయి. కాశీబుగ్గ పట్టణ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి వినతులను స్వీకరించారు. వినతులు స్వీకరించిన ఎస్పీ సమస్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

క్లుప్తంగా

అయోడిన్‌పై విద్యార్థులకు అవగాహన



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

పలాస: మనం నిత్యం వాడే ఉప్పులో అయోడిన్ ఉండాలని, అది ఒక సూక్ష్మ పోషకమని బ్రాహ్మణతర్లా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ రమణరావు అన్నారు. పాఠశాలలో శుక్రవారం అయోడిన్ రుగ్మతల లోప నివారణ వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించారు. అయోడిన్ ప్రాధాన్యంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. సైన్స్ ఉపాధ్యాయుడు కొయ్యల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు లావణ్య



లావణ్య

ఇచ్ఛాపురం రూరల్: డొంకూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.లావణ్య అండర్-17 బాలికల విభాగంలో రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైంది. ఈ విషయాన్ని ప్రధానోపాధ్యాయురాలు జి.సరోజ శుక్రవారం తెలిపారు. ఈ నెల 27 నుంచి 29వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా రాయచోటి వేదికగా జరుగనున్న పోటీలకు జిల్లా జట్టు తరపున లావణ్య ప్రాతినిధ్యం వహించనున్నట్టు పేర్కొన్నారు.

పాఠశాల సందర్శన



విద్యార్థుల ప్రతిభను పరిశీలిస్తున్న ఎంఈవోలు

కంచిలి: జలంత్రకోట పంచాయతీ చొట్రాయిపురం ప్రాథమిక పాఠశాలను విద్యాశాఖాధికారులు ఎస్.శివరాంప్రసాద్, కె.చిట్టిబాబులు శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల ప్రతిభను పరీక్షించారు. మధ్యాహ్న భోజన పథకం అమలుతీరు, స్టూడెంట్‌కిట్ల పంపిణీ, విద్యార్థుల వర్క్‌బుక్ కరెక్షన్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. తిరుపతిరావు, సహోపాధ్యాయులు ఉన్నారు.

హెల్మెట్ విధిగా ధరించాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సింహాచలం

సంతబొమ్మాళి: ప్రతి వాహన చోదకుడు హెల్మెట్ తప్పని సరిగా ధరించాలని సంతబొమ్మాళి ఎస్ఐ సింహాచలం అన్నారు. బోరుభద్రలో ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై శుక్రవారం అవగాహన కల్పించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వద్దని సూచించారు.

మిత్ర పురుగులను కాపాడుకోవాలి



సోంపేట: రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సోంపేట: పంటలకు మేలు చేకూర్చే మిత్రపురుగులను రైతులు కాపాడుకోవాలని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి అన్నారు. పాత్రకొండ ప్రదర్శన క్షేత్రంలో శుక్రవారం పొలంబడి నిర్వహించారు. వాతవరణం, మిత్రపురుగులు, శత్రుపురుగులు విశ్లేషించే విధానాన్ని వివరించారు. పంటకు ఆశించిన చీడపీడల నివారణపై అవగాహన కల్పించారు. వ్యవసాయ సహాయకులు కదంబాల కుమారి, రైతులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



నిరసన తెలియజేస్తున్న సీపీఎం నాయకులు

కోటబొమ్మాళి: పెరిగిన నిత్యావసరాల ధరలను ప్రభుత్వం తగ్గించాలని సీపీఎం మండల కార్యదర్శి హనుమంతు ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయం వద్ద ధరల పెరుగుదలపై నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అలాగే ధరల పెరుగుదలపై వచ్చేనెల 9, 10 తేదీల్లో పలాసలో నిర్వహించనున్న సీపీఎం జిల్లా మహాసభకు ఎక్కువమంది హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు. సీపీఎం నాయకులు బోర శ్రీను, నందరావు, వెంకటరావు పాల్గొన్నారు.

సంప్రదాయాలు గుర్తొచ్చేలా..

వందల ఏళ్ల నాటి మన పల్లెలు, వాటి సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు గుర్తు చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు మన పలాస- కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి రెల్లివీధి వాసులు. ఇక్కడ ఎన్నో ఏళ్లుగా నందెన్న ఉత్సవాలను ప్రతిఏటా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా అలనాటి ఎర్రమన్ను అలకడం, దానిపై వరిపిండితో చుక్కల ముగ్గులు వేయడం, ఉమ్మడి కుటుంబాలు ఒకే ఇంట్లో ఉండేవారని గుర్తు చేసుకోవడం వంటి కళలతో ఏర్పాటు చేసిన భారీ సెట్టింగ్ చూపరులను ఆకట్టుకుంటోంది. దీంతో వీటిని చూసేందుకు అధిక సంఖ్యలో జనం వెళ్తున్నారు. – కాశీబుగ్గ



నరకయాతన

కోటబొమ్మాళి మండల కేంద్రం నుంచి నీలంపేట-తాటిపర్తికి వెళ్లే రోడ్డు పూర్తిగా పాడైపోయింది. ఈ రోడ్డు గోతులమయం కావడంతో వాహనాలపై ప్రయాణించేవారు నరకయాతన పడుతున్నారు. మండల కేంద్రానికి వెళ్లే విద్యార్థులు, ప్రయాణికులకు ప్రతిరోజూ అగచాట్లు తప్పడం లేదు. అందువలన అధికారులు స్పందించి గోతులు పూడ్చి, కొత్తగా తారురోడ్డు వేయాలని స్థానికులు కోరుతున్నారు. – కోటబొమ్మాళి



స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయరూ..!

పాత జాతీయ రహదారిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎంజేపీ ఏపీ పాఠశాల జంక్షన్‌లో స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రధానంగా రోడ్డుకు ఆనుకుని విద్యాసంస్థలు ఉన్నప్పటికీ, ఈ ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలనే ఆలోచన చేయకపోవడం బాధాకరమని స్థానికులు వాపోతున్నారు. రోడ్డుకు రెండువైపులా మితిమీరిన వేగంతో వస్తున్న వాహనాలతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరుతున్నారు. – టెక్కలి



కాలువను చెత్త కుప్పగా మార్చేశారు..

టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి కొండ్రవీధిలో మురుగు కాలువను చెత్త కుప్పగా మార్చేశారు. దీంతో ఒక వైపు దుర్గంధం మరో వైపు మురుగు నీరు ప్రవహించకపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే ప్రాంతంలో రోడ్డుకు ఆనుకుని ఇటువంటి దుస్థితి ఉండడంపై స్థానికులు విమర్శలు చేస్తున్నారు. పంచాయతీ యంత్రాంగం స్పందించి కాలువలో పేరుకుపోయిన చెత్తను తొలగించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. – టెక్కలి



విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ఇచ్ఛాపురం: వ్యాసరచన పోటీల్లో కేజీబీవీ విద్యార్థినులు



ఇచ్ఛాపురం రూరల్: ఆదిత్యా కళాశాలలో పోటీలు నిర్వహిస్తున్న పోలీసులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్థానిక కేజీబీవీ, పురుషోత్తపురం మోడల్ స్కూల్లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 'సైబర్ నివారణలో యువత పాత్ర' అనే అంశంపై పోటీలను నిర్వహించినట్లు పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై ఇ.చిన్నంనాయుడు తెలిపారు.



కంచిలి: విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

- **కంచిలి:** సైబర్ నేరాగాళ్లలో పడకుండా ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సోంపేట సీఐ బి.మంగరాజు అన్నారు. కంచిలి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సైబర్ నేరాలు నిర్మూలన అనే అంశంపై అవగాహన కల్పించే విధంగా ఉపన్యసించి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీతారాంనాయుడు అధ్యక్షతన వ్యాసరచన పోటీలను నిర్వహించారు. స్థానిక ఎస్ఐ జి.రాజేష్, పోలీస్ సిబ్బంది, పాఠశాల పీడీ రోజారమణి పాల్గొన్నారు.
- **ఇచ్ఛాపురం రూరల్:** రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎం.తోటూరు ఆదిత్యా విద్యా సంస్థల్లో డిగ్రీ విద్యార్థులకు వ్యాస రచన పోటీలను నిర్వహించారు. పోలీసుల విధులు, వారి బాధ్యతలపై పోటీలు నిర్వహించినట్టు ఎస్సై ఇ.శ్రీనివాస్ తెలిపారు.

పారదర్శకంగా పశుగణన

కాశీబుగ్గ: పశుగణనను పారదర్శకంగా చేపట్టాలని సిబ్బందికి జిల్లా జాయింట్ కలెక్టర్ ఎఫ్ఏ ఖాన్ సూచించారు. 21వ పశుగణన పోస్టర్ల ఆవిష్కరణ, సెన్సస్ కిట్‌ల ప్రారంభోత్సవాన్ని శుక్రవారం చేపట్టారు. ఏరియా పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ పోతనపల్లి చంద్రశేఖరావు ఆధ్వర్యంలో పలాసలో కార్యక్రమం జరిగింది. దేశ వ్యాప్తంగా శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28వ తేదీ వరకు పశుగణన జరుగుతోందన్నారు. సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పశువుల గణాంకాలు నమోదు చేసి స్టిక్కర్లు అతికిస్తారన్నారు. పశుసంవర్ధక అభివృద్ధికి దోహదపడే అంశాలైన పాలు, మాంసం, గుడ్ల ఉత్పత్తి, జీడీపీ వృద్ధిని తెలుసుకోవడానికి ప్రతి ఐదేళ్లకు గణన చేపడతారన్నారు. పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చంద్రశేఖరావు మాట్లాడుతూ.. పలాసలో ఎనిమిది మంది, మందసలో 16 మంది ఎన్యూమరేట్లు పశు గణన చేపడతారన్నారు. కార్యక్రమంలో పలాస తహసీల్దార్ కల్యాయణ చక్రవర్తి, డాక్టర్ కె.మధుబాబు పాల్గొన్నారు.



పశుగణన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

విద్యుత్ ప్రమాదాలపై అవగాహన

కంచిలి: విద్యుత్ ప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా విద్యుత్ విజిలెన్స్ సీఐ కె.కె.వి.విజయనాథ్ అన్నారు. మకం సరియాపల్లి గ్రామంలో విద్యుత్ ప్రమాదాల నివారణ..తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విజిలెన్స్ యంత్రాంగం శుక్రవారం అవగాహన కల్పించారు. విద్యుత్ విషయంలో ఏర్పడుతున్న ప్రమాదాల తీరు, వాటిని నిరోధం గురించి వివరించారు.



అవగాహన కల్పిస్తున్న జిల్లా విజిలెన్స్ సీఐ విజయనాథ్

ఎల్ఐసీ ఏజెంట్ల నిరసన



సోంపేటలో నిరసన తెలియజేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

సోంపేట: ఐక్యతగా ఉంటూ కుట్రలను తిప్పికొడదామని సోంపేట, పలాస బ్రాంచ్‌ల పరిధిలోని ఎల్ఐసీ ఏజెంట్లు అన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోంపేటలో ఏజెంట్లు శుక్రవారం సమావేశమయ్యారు. సంస్థ అక్టోబర్ నుంచి అమలు చేస్తున్న వ్యాపార విధానంతో ఏజెంట్లు, గ్రామీణ ప్రజలకు సమస్యాత్మకంగా మారుతుందన్నారు. సమస్యలు పరిష్కరించి ఏజెంట్లకు న్యాయం చేయాలన్నారు. సమావేశంలో యూనియన్ నేతలు రాజేంద్రనాయుడు, కొదండరావు, ప్రకాష్, ఢిల్లేశ్వరరావు, చిన్నారావు, వసంతరావు, రామ్మూర్తి, పద్మలోచన ఉన్నారు.